## క్లుప్తంగా

### రైల్వేస్టేషన్‌లో ఆహార పదార్థాల తనిఖీ



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత విభాగాధికారులు

**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఆహార భద్రత విభాగం అధికారులు జగదీష్, మద్దిలేటి స్టేషన్ ఆవరణలో విక్రయిస్తున్న పలు ఆహార పదార్థాలను పరిశీలించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాలను తిరుపతి విచ్చేస్తున్న భక్తులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందివ్వాలని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు చేసి దుకాణదారులతో మాట్లాడారు.

### పోషకాహారంపై అవగాహన ముఖ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వసంతాబాయి

**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ కేంద్రం పరిధిలోని చిన్న పిల్లల పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయి ఆదేశించారు. శుక్రవారం స్థానిక అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యాంబర దశ విద్య, డిజిటలైజేషన్, అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణలో పురుషుల భాగస్వామ్యం, స్థూలకాయ నివారణ..ఇత్యాది అంశాలపై ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో స్త్రీశక్తి ప్రాజెక్టు జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణమంజరి, సీడీపీఓ శాంతి దుర్గ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### వీధి వ్యాపారులకు మౌలిక వసతులు ప్లీజ్!



వీధి వ్యాపారుల సంఘం బోర్డు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, వ్యాపారుల సంఘ నేతలు

**తిరుపతి కల్చరల్:** సుప్రీం కోర్టు తీర్పు మేరకు వీధి వ్యాపారుల హక్కులను ప్రభుత్వాలు గుర్తించి మౌలిక వసతులు కల్పించాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ హెచ్చరించారు. ఎంఆర్‌పల్లె కూడలి వద్ద ఏర్పాటు చేసిన వ్యాపారుల సంఘ బోర్డును ఆవిష్కరించి వారు మాట్లాడారు. స్థానిక నేతల అవినీతి పెట్రేగిపోతోందని, వీరి అవినీతి వీధి వ్యాపారులను కూడా వదలడం లేదని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, సంఘం నేతలు కే.మునిబాలాజి, ఎం.శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్, ఏపీ.బాల, రామచంద్రయ్య, గోవిందస్వామి, సుధీర్ పాల్గొన్నారు.

### విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**తిరుపతి లీగల్:** న్యాయవాదుల సంతాప సభలపై రాష్ట్ర హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. సాధారణంగా రాష్ట్రంలో ఏ న్యాయవాది మృతి చెందినా ఆయా న్యాయవాదులు అసోసియేషన్ సభ్యులు ఉదయం10:30 గంటలకు కోర్టులలో సంతాప సభ నిర్వహించేవారు. అయితే హైకోర్టు ఇటీవల మృతి చెందిన న్యాయవాదులకు ఆయా న్యాయవాద అసోసియేషన్లు సంతాప సభలను సాయంత్రం 4 గంటలకు తర్వాత నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల న్యాయవాదుల అసోసియేషన్లు వినతి పత్రాలు పంపాయి. అయితే హైకోర్టు స్పందించకపోవడంతో విధులను బహిష్కరించారు. తిరుపతి న్యాయవాదులు అసోసియేషన్ అధ్యక్షుడు గజేంద్ర, ప్రధాన కార్యదర్శి విద్యానాథరెడ్డి, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

### 'కీచకవధ' హరికథాగానం

**రామచంద్రాపురం:** మండలంలోని నూతిగుంటపల్లె సమీపంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భాగతారిణి పూర్ణిమ కీచకవధ హరికథాగానం చేశారు. తన పద్యాలాపనతో భక్తులను భాగవతారిణి ఆకట్టుకున్నారు. అనంతరం ఆమెను ఉభయదారులు సన్మానించారు.

### మండల సమావేశం రేపు

**చంద్రగిరి:** మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

# బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు



విద్యుత్తు వెలుగులతో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆలయ పరిసరాలు

ప్రతి ఏటా తిరుమల తరహాలో ఉత్సవాలు నిర్వహించే తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రధాన ఆలయం విద్యుత్తు దీపాల శోభతో సరికొత్త కాంతులీనుతోంది. వాహన సేవల మార్గంలో నిర్దేశించిన హారతి పాయింట్ల వద్ద పందిళ్లు వేశారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

- విద్యుత్ శోభతో తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం
- ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**తిరుపతి రూరల్:** ఈనెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వివిధ పనులను పర్యవేక్షిస్తున్నారు. తుమ్మలగుంట పురవీధుల్లో రోజూ వివిధ వాహనాలపై స్వామి వారిని ఊరేగించే ప్రాంతాల్లో పారిశుధ్యం చర్యలకు పూనుకున్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాలతో పాటు తెలుగుతల్లి విగ్రహం వద్ద నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి, గంగమ్మ గుడి వీధి, ఆంజనేయస్వామి ఆలయ పరిసర వీధుల్లో మురుగు కాలువల్లో పూడిక తొలగించి శుభ్రం చేయించారు.

**వాహన సేవల వివరాలు ఇవీ**

23న సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. 24న సాయంత్రం 5–6గంటల మధ్యన ధ్వజారోహణం, అదే రోజు రాత్రి పెద్ద శేషవాహనం, 25న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 26న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 27న ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 28 ఉదయం పల్లకీలో మోహినీ అవతారం, రాత్రి గరుడవాహనం, 29న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనం, 30న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రిక చంద్రప్రభ వాహనం, అక్టోబర్1న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. 2న ఉదయం చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఉత్సవాల సమయంలో రోజూ సాయంత్రం 5.30 నుంచి గంటపాటు ఉయ్యాలసేవ నిర్వహిస్తారు.



## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు



నిరసన ర్యాలీ చేస్తున్న ఏఐడీఎస్‌ఓ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** రాష్ట్రంలో గత ప్రభుత్వం వైద్య విద్యకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించిన నూతన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం తగదని, దీనికి సంబంధించి వెలువరించి జీఓను 590ను రద్దు చేయాలని ఏఐడీఎస్‌ఓ తిరుపతి నగర కార్యదర్శి జి.ఉన్నతి డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీ కాలనీ బస్టాప్ నుంచి సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను ప్రైవేటుపరం చేసేందుకుపీపీపీ పద్ధతిని తేవడం దుర్మార్గమని, 2,350కుపైగా మెడికల్ సీట్లను నిస్సిగ్గుగా అమ్ముకోవడానికి చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## 'మన డబ్బులు–మన లెక్కలు' చెప్పిన పీడీ



అధికారులు నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

**తిరుపతి రూరల్:** పొదుపు సంఘాల్లో జవాబుదారీ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 'మన డబ్బులు–మనలెక్కల'పై శుక్రవారం చెర్లోపల్లెలో 3, పేరూరులో 4 సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి టిఎన్.శోభన్‌బాబు మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కట్టే పొదుపు, పొందిన రుణాలు, చెల్లించిన రుణాలు, అలాగే సంఘం తరపున చెల్లించాల్సిన రుణ వివరాలు..ఇత్యాదివన్నీ యాప్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ వల్ల డ్వాక్రా సంఘం లెక్కలకు భద్రత ఉంటుందని, ఏ పొదుపు సంఘంలోనైనా అవకతవకలు చోటుచేసుకుంటే క్షణాల్లో తెలిసిపోతుందని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని అరికట్టడానికి యాప్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ వెంకటేష్, ఏపీఎం నాగేశ్వరావు, సీసీలు, సీఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

## మందులు సైడ్ ఎఫెక్ట్స్ ఇస్తే కంపెనీలపై చర్యలు




క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్విమ్స్ డీన్, ఇతర అధికారులు, ఫార్మసీ విద్యార్థులు

**తిరుపతి తుడా:** వివిధ వ్యాధుల నుంచి కోలుకునేందుకు ప్రజలు వినియోగించే ఏ మందులైనా సైడ్ ఎఫెక్ట్స్ ఇచ్చిన పక్షంలో ఆ మందుల కంపెనీలపై చర్యలు తీసుకోవచ్చని, అంతేకాకుండా మార్కెట్‌లో ఆ మందుల ఉపసంహరణకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వవచ్చని స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్విమ్స్ ఓపీడీ బ్లాక్, ఎండోక్రైనాజీ విభాగం వద్ద 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలను పద్మావతి హాస్పిటల్ ఫార్మకాలజీ విభాగం నిర్వహించింది. క్యూ ఆర్ కోడ్‌ల పోస్టర్లను డీన్, ఇతర అధికారులు ఆవిష్కరించి మాట్లాడారు. పీవీపీఐ క్యూ ఆర్ కోడ్‌ను రోగుల సౌలభ్యం కోసం కొత్తగా ప్రవేశపెట్టి, వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మందులు రియాక్షన్ ఇచ్చిన పక్షంలో బాధితులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ మందులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. మందుల బ్యాచ్ నంబర్, ఎక్స్‌పైరీ తేదీ ..ఇత్యాది వివరాలను అందులో నిక్షిప్తం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఫిర్యాదులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. అంతేకాకుండా టోల్ ఫ్రీ నంబర్‌కు సైతం ఫిర్యాదు చేయవచ్చని రోగులు, వారి సహాయకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ కో–ఆర్డినేటర్ పల్లవి, పీవీపీఐ అసోసియేట్ మనీషా, ఫార్మ కాలేజీ ప్రొఫెసర్ సుభాష్, డాక్టర్ విజయ చంద్రారెడ్డి, స్టాఫ్ నర్సులు, క్లినికల్ ఫార్మసిస్టులు, వివిధ కాలేజీల ఫార్మసీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎస్వీ మెడికల్ కళాశాలలో..**

5వ జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలను ఎస్వీ మెడికల్ కాలేజీనూ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడారు. రోగుల భద్రత, ఔషధ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఔషధాల వినియోగం, ప్రతికూల అంశాలపై కరపత్రాలను విడుదల చేశారు. వైద్యాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 22న చిత్రలేఖన పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**తిరుపతి కల్చరల్ :** వికసిత్ భారత్‌లో భాగంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించే చిత్రలేఖన పోటీలలో చిత్రకారులు, యువత, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ రాఘవన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్రలేఖన పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశాభివృద్ధి, ఐక్యత, వికసిత్ భారత్ పట్ల ప్రజల మనోభావాలను కళా రూపంలో ప్రతిబింబించాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా మూడు విభాగాలలో జరిగే ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు, ప్రొఫెషనల్ ఆర్టిస్టుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు, అలాగే యూనివర్శిటీ, కళాశాల విద్యార్థుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, పాఠశాల విద్యార్థుల విభాగం(7 నుంచి 12వ తరగతి వరకు) రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 బహుమతులు అందజేస్తామన్నారు. పాల్గొనే వారికి తామే మెటీరియల్స్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 98668 74963, 63036 01422 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో ప్రాజెక్టు అసిస్టెంట్స్ ధనుష్, శ్రీహర్ష పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత రమేష్

**తిరుపతి కల్చరల్:** రాష్ట్రంలో పంట నష్టాలు చవిచూస్తున్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ, ప్రతి పంటకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని ఏళ్ల కాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే ఏళ్లకాలంగా పనిచేస్తున్న టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆర్టీసీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వలన ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఆటో కార్మికుడికి ఏటా రూ.25వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షిస్తామంటూనే మరో వైపు, కేంద్రం, కూటమి ప్రభుత్వాలు దాని ప్రైవేటీకరణకు వేగవంతంగా చర్యలు తీసుకోవడం దుర్మార్గమని నిరసించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, ఏ.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జనార్ధన్, సాయిలక్ష్మి, మాధవ్, లక్ష్మి, వెంకటేష్, హరినాథ్, రవి పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఎంఈఓలు, టీచర్లు

**పాకాల:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు దామలచెరువు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుమతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మానం చేశారు. అవార్డు గ్రహీతలైన తెలుగు టీచర్ రఘునాథ్, ఫిజిక్స్ టీచర్ పురుషోత్తంను ఎంఈఓలు బాబ్జి, లింగయ్య తదితరుల చేతుల మీదుగా సన్మానించారు. విద్యార్థుల ఉన్నతికి నిబద్ధతతో పనిచేసేవారని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించేవారని వారి సేవలను ప్రస్తుతించారు. అనంతరం స్కూలు అభివృద్ధికి పత్తిపాటివారిపల్లెకు చెందిన చెక్కల అశోక్‌బాబు రూ.10వేల విలువైన చేసే విద్యా సామగ్రిని వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


### ఫంగల్ డిసీస్‌పై అవగాహన



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

**తిరుపతి తుడా:** స్విమ్స్ పద్మావతి ఆస్పత్రి మైక్రోబయాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఫంగల్ డిసీస్‌పై నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ, ఫంగస్ వ్యాధి చర్మం, గోర్లను ప్రభావితం చేసేవిగా ఉంటాయని, రక్తప్రసరణ సరిగా లేక మధుమేహం ఉంటే తీవ్రమైన ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించి వ్యాధిని నయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ, డెర్మటాలజీ విభాగాధిపతులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సురేఖ, మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హారిక, డాక్టర్ రామకృష్ణ, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మౌర్య, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అనుమతి లేని భవన నిర్మాణాలు తొలగింపు



భవన నిర్మాణాలు తొలగిస్తున్న అధికారులు

**తిరుపతి తుడా:** నగరపాలక సంస్థ పరిధిలో గోదాదేవి మార్గంలోని వెంకటేశ్వర స్కూల్ వెనుక అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించామని డిప్యూటీ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ఖాన్ తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశాలతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ మూర్తి, మధు, టీపీఓ వంశీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవాళి రక్షణకు ధ్యానం ఓ మార్గం



రమ్యానంద భారతి స్వామిని

**తిరుపతి కల్చరల్:** ప్రపంచం, మానవాళి రక్షణకు ధ్యానం ఓ మార్గమని, ఆధ్యాత్మిక, ఆరోగ్య సమాజ స్థాపనకు ఇది దోహదం చేస్తుందని శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని ఉద్ఘాటించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ పీఎంసీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న ధ్యాన మహాయజ్ఞంలో శుక్రవారం ఆమె ముఖ్యవక్తగా మాట్లాడారు. పిరమిడ్ మాస్టర్లు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివ, డి.సతీష్, పీఎంసీ ఈడీ సేత్ బాలకృష్ణ, ఎండీ ఆనంద్‌కుమార్, పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు.

## ప్రసూతి వైద్యశాల ఉద్యోగినులకు వైద్య పరీక్షలు

**తిరుపతి తుడా:** ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఉద్యోగినులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ఆవశ్యకతను గురించి వైద్యాధికారులు తెలియజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీల, పర్యవేక్షణ సామాజిక వైద్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సునీత, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షమొస్తే ఇంతే సామీ..!

- రోడ్లలో ఏరులై పారిన వర్షపు నీరు
- లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు



వినాయక సాగర్ కూడలి వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీరు



లీలా మహల్ కూడలి వద్ద వరదను తలపిస్తున్న వర్షపు నీరు

**తిరుపతి తుడా:** తిరుపతిని మూడు రోజులుగా వాన ముంచెత్తుతోంది. మూడు రోజుల క్రితం భారీ వర్షం పడడంతో నగరం అతలాకుతలమైంది. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగాగంట పాటు కురిసిన భారీవర్షానికి నగరంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు ఏరులై పారింది. మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజాజీవనం స్తంభించింది. రోడ్లను మోకాలి లోతుతో మురుగునీరు ముంచెత్తడంతో స్కూళ్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాదచారులు, దిచక్రవాహదారుల అవస్థలు వర్ణనాతీతం. లీలా మహల్ కూడలి నుంచి బొంతలమ్మ గుడి వరకు ప్రధాన రహదారి కాలువల నుంచి నుంచి వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో నదీ ప్రవాహాన్ని తలపించాయి. ఇక్కడా అగచాట్లు తప్పలేదు. ఇక, లక్ష్మీపురం సర్కిల్‌లో సేమ్ టు సేమ్. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద గండ పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆటోనగర్ అస్తవ్యస్తమైంది.

## డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్

–సాఫ్ట్‌వేర్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు



తిరుపతిలో నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖరులు

**చంద్రగిరి:** రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను నిరసిస్తూ దస్తావేజు లేఖరులు చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎదుట పెన్ డౌన్ చేసి ఆందోళన చేశారు. తిరుపతి జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం (జేఏసీ) అధ్యక్షుడు, రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యుడు సీఎం.కేశవులు మాట్లాడుతూ, ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో విలువైన సమయం వృథా అవుతోందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ రెండు రోజులపాటు పెన్‌డౌన్‌లో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొంటారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన నేతలు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

**తిరుపతిలో..**

**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** తిరుపతి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల ప్రధాన కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ తయారీలో ఓటీపీ విధానం శిరోభారంగా మారిందన్నారు. ఆస్తి కొనుగోలుదారులు, విక్రయించేవారు ఆధార్ అనుసంధానం మేరకు ఓటీపీ చెప్పడం లేదని, దీనిని మూలాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవాలనే డిమాండ్‌తో రెండు రోజుల పాటు పెన్‌డౌన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు.

## రైల్వే మజ్దూర్ యూనియన్ ఆందోళన

–వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్



తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుల నిరసన

**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ దేశవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, 2026 జనవరి నుంచి అమలు కావాల్సిన ఎనిమిద వేతన సవరణకు సంబంధించి సంఘం ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. ఫలితంగా కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఇకనైనా కేంద్రం దీనిపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తిరుపతి జనరల్ బ్రాంచ్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శులు నారాయణస్వామి, రవీంద్రనాయక్, కోశాధికారులు మారయ్య, గౌస్‌బాషా, సభ్యులు వెంకటేష్, జగదీష్, శ్రీనివాసులు, అమిత్ పాశ్వాన్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏఐఎస్‌ఎఫ్ ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

**తిరుపతి రూరల్:** ఉన్నత విద్యా వ్యవస్థను గాడిన పెట్టి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు ఏఐఎస్‌ఎఫ్ నేతలు ధర్నా చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేయాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని, ఉన్నత విద్యకు శాపంగా మారిన జీఓ నెంబర్ 77 రద్దు చేయాలని, విద్యార్థి సంఘాలపై విధించిన నిషేధాజ్ఞలను ఎత్తివేయాలని, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న 3500 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తామన్న నారా లోకేష్ ఏమీ చేయడం లేదని విమర్శించారు. 'రెడ్‌బుక్' పేరిట వేధించడానికి, అక్రమ కేసులు బనాయించడానికి చూపుతున్న శ్రద్ధ సమస్యలపై లేదని మండిపడ్డారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించని పక్షంలో సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, మంత్రులు ఏ జిల్లాలో పర్యటించినా నిలదీస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, మోహన్, ఓం రాజ్, వినయ్, నగర నాయకులు గ్రేస్, పవన్, లోకేష్, హరీష్, నాని, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు సామూహిక పొంగళ్లు



ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

**చంద్రగిరి:** చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం స్థానికులు పొంగళ్లను సమర్పించారు. పట్టణంలోని ఆకుతోటవీధి, పాతపేటకు చెందిన భక్తులు గ్రామ బలిదేవతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అక్కడ నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లను పెట్టి, అమ్మవారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పిన పెద్ద విరుపాక్షి శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మునిరామిరెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, దామోదర్‌రెడ్డి, పాదిరి ధనుంజయరెడ్డి, విరుపాక్షి గురవారెడ్డి, ఏ.చంద్రశేఖర్ రెడ్డి, పాదిరి దామోదర్ రెడ్డి, పిచ్చి సుధాకర్ రెడ్డి, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.